

- ప్రచారంలో ముగ్గురి పేర్లు
- లష్కర్ బీజేపీ శ్రేణుల్లో కలవరం
- ఇంకా ఖరారు కాని బీజేపీ అభ్యర్థి

ఒక్కొక్కరిది ఒక్కో సెంటిమెంట్.. ఎవరికో కమలం టికెట్




రేసులో ముగ్గురు...

సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకునేందుకు ఆ పార్టీకి చెందిన డజను వరకు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు ఎందరు చేసుకున్నా రన్నదానితో సంబంధం లేకుండా ముగ్గురు నాయకుల్లో ఎవరో ఒకరికి కచ్చితంగా బీజేపీ టికెట్ ఖాయమన్న ప్రచారం జరుగుతుంది. నగర మాజీ మేయర్ బండా కార్తీకారెడ్డి, పార్టీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నగర ఉపాధ్యక్షుడు బండపల్లి సతీష్ ముగ్గురు నాయకుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పలు అంశాలను పరిశీలించి అనేక వడపోతల అనంతరం ముగ్గురి పేర్లను అధిష్ఠానం తెరమీదకు తెచ్చినట్లు బీజేపీ నాయకులు చెప్పుకుంటున్నారు.

సికింద్రాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ లష్కర్ రాజకీయ సమీకరణలు రోజుకొక మలుపు తిరుగుతున్నాయి. నెల రోజుల క్రితమే బీఆర్ఎస్.. ఇటీవల కాంగ్రెస్ పార్టీలు సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కోసం తమ అభ్యర్థులను ప్రకటించగా ఇరు పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నారు. ఇప్పటికే వారు నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో 1వ విడత ఎన్నికల ప్రచారం సైతం పూర్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రచారంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అస్త్రాలుగా వాడుతూ మరోమారు తమ పార్టీ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు.కాంగ్రెస్ నాయకులు మాత్రం వాడివేడిగా విమర్శలు చేస్తూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాల వైఫల్యాలను ఎత్తిచూపుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే.. బీజేపీ శ్రేణులు మాత్రం అభ్యర్థిత్వం ఖరారు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

ఎవరి ధీమా వారిదే..

మహిళా కోటాలో తనకే టికెట్ వస్తుందని నగర మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి ధీమాతో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మహిళలు మేరీ రవీంద్రనాథ్, జయసుధ మొదటిసారి విజయం సాధించారు. అదే కోవలో తనకు బీజేపీ టికెట్ ఇవ్వాలని కార్తీకారెడ్డి కోరుతున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం మొదటి నుంచి బీసీ నియోజకవర్గంగా ఉందని మేకల సారంగపాణి చెబుతున్నారు. బీసీలకు టికెట్ ఇవ్వడం ద్వారా మాత్రమే పార్టీ గెలుపు సాధ్యం అవుతుందని ఆయన పేర్కొంటున్నారు. అదే కేటగిరీలో తనకు ఇస్తే బీసీ సెంటిమెంట్‌తో గెలిచి తీరుతామని అంటున్నారు. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో సికింద్రాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బండపల్లి సతీష్ ఈమారు మళ్లీ టికెట్ కోసం యత్నాలు చేస్తున్నారు.



గత ఎన్నికల్లో తాను బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన తర్వాత మాత్రమే పార్టీ కేడర్ పెరిగిందని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మారు టికెట్ ఇస్తే విద్యావంతుడు, విదేశీ పరిపాలన విధానాలు చూసివచ్చిన తనను లష్కర్ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించుకుంటారని బండపల్లి సతీష్ ధీమాలో ఉన్నారు.

పార్టీ శ్రేణుల్లో అయోమయం..

లష్కర్ ఎమ్మెల్యే టికెట్ ఖరారు విషయంలో పార్టీ వైఖరి ఏంటో అర్థం కాక బీజేపీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు బీజేపీ అభ్యర్థులు ఐదు డివిజన్లలో గట్టిపోటీ ఇచ్చారు. అన్ని డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించినప్పటికీ బీజేపీ అభ్యర్థులు గట్టిపోటీ ఇచ్చారు. మెట్టుగూడ, బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో వందల ఓట్ల తేడాతోనే బీజేపీ అభ్యర్థులు పరాజితులయ్యారు. అదే ఊపును త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కొనసాగించి తమ పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని పార్టీ నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. గత ఫలితం రిపీట్ అవుతుందా లేదా పక్కన పెడితే అభ్యర్థిత్వం ఖరారులో జరుగుతున్న ఆలస్యం మాత్రం పార్టీ శ్రేణులను కలవర పరుస్తోంది. ఓ వైపు బీఆర్ఎస్, మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం జోరు పెంచుతుంటే బీజేపీ ఇంకా పేర్ల పరిశీలన చేస్తుండడం లష్కర్ బీజేపీ నాయకులు మాత్రం తమ అభ్యర్థి ఎవరో.. ప్రచారం ఎప్పుడు ప్రారంభం అవుతుందో అని ఎదురు చూస్తున్నారు.

'రాష్ట్రంలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమే'



ఇందిరాగాంధీకి నివాళి అర్పిస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: రాష్ట్రంలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మోండా డివిజన్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఆమె నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీని తాను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో కొనసాగుతున్నానన్నారు. ఒక మహిళగా సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసి ప్రజల రుణం తీర్చుకుంటానని ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, శివకుమార్, ప్రకాష్, మహేష్, హరీష్, జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- మోండా డివిజన్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు నందికంటి రవి, వేణు, ఆర్‌డీ నాగేష్‌యాదవ్, బాబురావు, సాల్మన్, రామకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- సనత్‌నగర్‌లో ఆర్‌బీ నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు రమేష్, కమల్‌రాజ్ పాల్గొని నివాళి అర్పించారు.



సనత్‌నగర్‌లో..

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



ఓటేయాలని అభ్యర్థిస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ఎస్‌బీటీనగర్, వడ్డెరబస్తీ, గౌతమ్ నగర్, ఓల్డ్ పాటిగడ్డ, నూర్‌బాగ్‌లో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజలు అధికంగా నివసించే పాటిగడ్డలో రూ.6 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను నిర్మించామని అదే విధంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను కూడా ఎంతో అభివృద్ధి చేశామన్నారు.

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనుగు పుశ్యంత్‌రెడ్డి తన అనుచరులతో కలిసి మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అధికారంలో ఉన్నంత కాలం అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేసిందని, మళ్లీ ఇప్పుడు మరొక్క అవకాశం అంటూ వస్తున్నారని విమర్శించారు. పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేషన్ రాజు, మహేందర్, మహేష్,వ సురేష్ పాల్గొన్నారు.
- నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న వారిని ఆదరించాలని తలసాని సాయికిరణ్‌యాదవ్ కోరారు. మంగళవారం బేగంపేట డివిజన్ ఓల్డ్ పాటిగడ్డ, నూర్‌బాగ్‌లో ఇంటింటికీ తిరుగుతూ చేసిన అభివృద్ధి గురించి వివరిస్తూ కారు గుర్తుపై ఓటు వేసి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

ఓటమి భయంతోనే దుశ్చర్యలకు పాల్పడుతున్నారు



మాట్లాడుతున్న లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: ఓటమి భయంతోనే దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆరోపించారు. మంగళవారం అడ్డగుట్టలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవాలి కానీ.. దాడులకు దిగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి వెన్నెతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, నక్క మధు, మనోహర్, శ్రీనివాస్‌గౌడ్, కై రంకొండ, పొన్నాల రాజు, మహ్మద్, ఎల్లయ్య, దేవయ్య పాల్గొన్నారు.

బౌద్ధనగర్: ఎన్నికల ప్రచారంలో ఉన్న దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి చేసి పచ్చటి తెలంగాణతో రక్తపాతం సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

శ్రీనివాస్‌యాదవ్‌ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని రాంగోపాల్‌పేట్ డివిజన్ ఇన్‌చార్జ్ రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఓల్డ్‌బోయిగూడలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ బూత్ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి బీఆర్ఎస్ సంక్షేమ కార్యక్రమాలు, మంత్రి చేసిన అభివృద్ధి పనులు తీసుకుని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అత్తెల్లి అరుణగౌడ్, కోళికే కిరణ్మయి, నాయకులు కిశోర్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, జనార్దన్, సతీష్, గణేష్ పాల్గొన్నారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మద్దతుగా అమీర్‌పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంత్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం బల్కంపేటలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన పతకాలను ఓటర్లకు వివరించారు. హింసా రాజకీయాలను ప్రేరేపిస్తున్న కాంగ్రెస్, మత రాజకీయాలతో పబ్బం గడుపుకొంటున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

క్లుప్తంగా...

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని వినాయకస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటాయన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 13, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 50, గోకరకాయ 23, కీర 40, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 54, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, ముల్లంగి 4-6

డాక్టరేట్ ప్రదానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. ఇంగ్లిష్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన సత్యవతికి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన పద్మశ్రీ శంతను నారాయణ్, వీసీ ప్రొ.రవీందర్ డాక్టరేట్ డిగ్రీని అందజేశారు.

అందెశ్రీ కూతురు వెన్నెలకు..



ఉస్మానియా యూనివర్సిటీ: అందెశ్రీ కూతురు ఏ.వెన్నెల ఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఓయూలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో పద్మశ్రీ శంతను నారాయణ్, వీసీ రవీందర్ చేతుల మీదుగా డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న వెన్నెలను కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ఏక్తా దివస్ ప్రతిజ్ఞ



సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో మంగళవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సర్దార్ వల్లభాయ్‌పటేల్ దార్శనికతను స్మరించుకున్నారు. స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకునేందుకు 'మేరీ మాటీ మేరా దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించడం స్ఫూర్తినిస్తుందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా



ప్రచారం చేస్తున్న ఆదం సంతోష్

బౌద్ధనగర్: రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా నడుస్తుందని సికింద్రాబాద్ అభ్యర్థి ఆదం సంతోష్ అన్నారు. నియోజకవర్గంలోని బౌద్ధనగర్ డివిజన్‌లోని అంబర్‌నగర్, లలితానగర్, కౌసర్ మసీదు, వారాసిగూడ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పాదయాత్ర చేస్తూ మాట్లాడారు. పదేళ్లుగా ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లోని ప్రజలు, రైల్వే ఉద్యోగులు, కార్మికులు తన బలం బలగం అన్నారు. అడ్డగుట్టలో 50 పడకల ఆస్పత్రి ఏమైందని, మాణికేశ్వర్ నగర్‌లో ఆస్పత్రి నిర్మాణం కోసం స్థానికులు 120 రోజులు రిలే దీక్షలు చేసినా స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పట్టించుకోలేదని ఇప్పుడు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసేందుకు ఇంటింటికీ తిరుగుతున్న పద్మారావుగౌడ్‌కు ఓటమి తప్పదన్నారు. ప్రచారంలో మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవి, ఆదం సృజన్, అనిల్ కుమార్, జయరాజ్, చక్రి, హరి, బబ్లూ, షకీల్ ఖాన్, వహీద్, ధన్‌రాజ్, సందీప్, అమరేందర్ పాల్గొన్నారు.

రైల్వేలో 53 మంది ఉద్యోగ విరమణ



ఉదయ్ భాస్కర్‌కు వీడ్కోలు పలుకుతున్న యూనియన్ నాయకులు

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ పరిధిలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న 53 మంది ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ చేశారు. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్‌లో వీళ్లు విధులు నిర్వహించారు. రైల్ నిలయంలోని అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున్, మజ్దూర్ యూనియన్ సహాయ కార్యదర్శి ఉదయ్ భాస్కర్‌కు సహోద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎంప్లాయీస్ సంఘ్ మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్, మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచ్ కార్యదర్శి చింతకుంట రామకృష్ణ పదవీ విరమణ చేసిన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలి



ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: కత్తి పోటుకు గురై సికింద్రాబాద్‌లోని యశోదా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని మంగళవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. వైద్యులను అడిగి ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఆరోగ్యం కుదుటపడి ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

శభాష్ ముషీరాబాద్ పోలీస్

ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్‌తో పాటు అదనపు ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య అభినందించారు. పాత నేరస్తులపై నిఘా పెట్టి వారిని అరెస్టు చేయడంలో తీసుకున్న శ్రద్ధను కొనియాడారు. భోలక్‌పూర్‌కు చెందిన రౌడీషీటర్ మహబూబ్ అలియాస్ లడాస్ గత కొన్నేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇతను తాజాగా భోలక్‌పూర్‌లో ఒక ఆటోను కూడా తగలబెట్టాడు. పటాన్‌చెరువులో జరిగిన ఓ హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్న అతను కోర్టుకు సైతం హాజరుకావడం లేదు. ఇతడిపై నిఘా పెట్టిన ముషీరాబాద్ పోలీసులు గుల్బార్గలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2021లో రిసాలగడ్డలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడి ఉన్న మొహియుద్దీన్ కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అతడిని మాదాపూర్ ప్రాంతంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులను ఛేదించినందుకు గాను కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్‌తో పాటు డిఐ డి.వెంకట్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు సి.హెచ్.ప్రసాద్‌రెడ్డి, వై.చలపతిరెడ్డి, ఆర్.ప్రేమ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ కె.కిషోర్, కానిస్టేబుల్స్ ఎం.ప్రకాష్, జి.సాయికుమార్ ఉన్నారు.



ముషీరాబాద్ పోలీసులను అభినందిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య

సమన్వయ లోపం.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో మంగళవారం దాదాపు 5 గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఉదయం 11 గంటలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను సాయంత్రం 5 గంటలకు పునరుద్ధరించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో మాణికేశ్వర్‌నగర్ వాసులు, వ్యాపారస్తులు, జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ షాపుల నిర్వాహకులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై స్థానికుడు భానుక చరణ్‌రాజ్ సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే తమకేమీ తెలియదంటూ సమాధానం చెప్పారని పేర్కొన్నారు. దీనిపై స్థానికంగా ఆరా తీయగా ఉదయం చెట్ల కొమ్మలు నరికివేసేందుకు రెండు గంటల పాటు విద్యుత్ నిలిపివేశారని తెలిసింది. అయితే చెట్ల నరికివేత పూర్తయిన తర్వాత పునరుద్ధరించడంలో అధికారుల మధ్య సమన్వయ లోపంతో సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా చేయలేదన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

- నగర కమిషనర్‌కు మర్రి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు

సనత్‌నగర్: అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఐఎం నేతల అభీష్టం మేరకు పోలీసు అధికారుల బదిలీలు జరిగాయంటూ మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసు ఉన్నతాధికారులు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారన్నారు.సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎస్ఆర్‌నగర్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, మహంకాళి, గాంధీనగర్, చిలకలగూడ పోలీస్‌స్టేషన్లలోని ఇన్‌స్పెక్టర్లందరూ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌చే ఎంపిక చేయబడి బదిలీపై వచ్చారన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి కేవలం మూడు రోజుల ముందు మంత్రికి తమ విధేయతను ప్రదర్శించుకునేందుకు పోలీసు అధికారులు తాపత్రాయ పడ్డారన్నారన్నారు. అదేవిధంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో కూడా స్థానిక ఎమ్మెల్యే పద్మారావు అభ్యర్థన మేరకు పోస్టింగ్‌లు ఇచ్చారన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలంటే ఇన్‌స్పెక్టర్లందరినీ తక్షణమే మార్చాలన్నారు. ఫిర్యాదు పత్రులను తెలంగాణ సీఈఓ, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు కూడా పంపించానన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభించిన పద్మారావు

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ చింతబావిబస్తీలో స్థానిక నాయకుడు, ఎంసీఆర్ ప్రజాసేవ ప్రతినిధి మ్యాకల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని సికింద్రాబాద్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా అన్నివర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని, అఖండ మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన మ్యాకల చంద్రశేఖర్‌ను అభినందించారు. రానున్న ఎన్నికల్లో పద్మారావు మరింత మెజార్టీ సాధించేందుకు తనవంతు కృషి చేస్తానని చంద్రశేఖర్ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

అడ్డగుట్ట: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని మహిళను రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ మురళీకృష్ణ వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై అక్టోబర్ 29న రాత్రి సుమారు 35-40 వయస్సున్న గుర్తు తెలియని మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. మృతురాలు నలుపు, పసుపు, ఆకుపచ్చ రంగులతో ఉన్న చీర, ఆరెంజ్ కలర్ జాకెట్ ధరించి ఉన్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని రాంగోపాల్‌పేట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం వివరాల ప్రకారం.. ఆర్పీరోడ్ దర్గా ప్రాంతంలోని ఓ షాపు ముందున్న ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి భమృతుడికి 50-55 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఒంటిపై నీలం రంగు లుంగీ, తెలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడని సంబంధీకులు ఉంటే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ప్రాణం తీసిన తొందరపాటు

ఇనుప రేకు గుచ్చుకొని మహిళ మృతి

అడ్డగుట్ట: తొందర పాటు ఓ మహిళ ప్రాణం బలికొంది. ట్రైన్ టికెట్ కోసం పట్టాలపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు ఇనుపరేకుపై పడి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డికి చెందిన సంగమేశ్వరి(58) దసరా పండుగ కోసం అల్వాల్‌లోని తన మరిది ఇంటికి వచ్చింది. తిరిగి మంగళవారం కామారెడ్డికి వెళ్లేందుకు తెల్లవారుజాము 5 గంటల సమయంలో తన మరిదితో కలిసి అల్వాల్ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. టికెట్ కొనేందుకు ప్లాట్ ఫామ్- 1 కి వెళ్లడానికి కిందకు దిగి తొందరపాటుగా పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో చీర పట్టాలకు తట్టుకొని ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు ఇనుప రేకు గుచ్చుకుని అక్కడికక్కడే మృతి చెందింది.